సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 14 । అక్టోబర్ । 2023

పూల జాతర

పుట్టింటికి వచ్చిన ఆడపడుచుల్లా..
రెక్కలు విచ్చిన సీతాకోకచిలుకల్లా..
కరుణించి కాపాడే అమ్మవారిలా..
'బతుకమ్మ'రానే వచ్చింది..
ఊరూవాడా భక్తిప్రపత్తులు నింపనుంది..
శనివారం నుంచి 'ఎంగిలిపూల'
వేడుకలు ప్రారంభంకానున్నాయి.
సద్దుల బతుకమ్మతో సంబురాలు
ముగియనున్నాయి.



న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన స్వర్ణకారులు



సమస్య వివరిస్తున్న స్వర్ణకారులు

సిరిసిల్లఅర్బన్: ఎన్నికల కోడ్ నుంచి స్వర్ణకారులకు మినహాయింపు ఇవ్వాలని సిరిసిల్ల పట్టణ స్వర్ణకారుల సంఘం సభ్యులు శుక్రవారం కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి విన్నవించారు. బృత్తిపరంగా మిషన్‌వర్క్, బంగారు కొనుగోలు విషయంపై నిత్యం హైదరాబాద్ వెళ్తుంటామని, ఎలక్షన్ కోడ్ ఉన్నందున పోలీసులు డబ్బులు, వస్తువులను సీజ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో తమ జీవనోపాధి దెబ్బతింటుందని, స్వర్ణకారులకు ఎలక్షన్ కోడ్ నుంచి మినహాయించాలని కోరారు. పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చెన్నోజు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి వెగ్గళం గోపి, కోశాధికారి నారోజు బాలయ్య తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట పోలీసుల పనితీరు భేష్

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్సై సుధాకర్‌కు రివార్డు అందిస్తున్న ఎస్పీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట పోలీసుల పనితీరు బాగుందని గంజాయి అక్రమ సరఫరాను చాకచక్యంగా చేధించారంటూ ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఈమేరకు శుక్రవారం ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్‌తోపాటు కానిస్టేబుళ్లు మధు, తిరుపతిలకు రివార్డులు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలను సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి సరఫరా గురించి తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీఎం సభకు తరలిరావాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



మాట్లాడుతున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని విస్మరించాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలను గ్రామపంచాయతీలుగా చేసి పాలనను ప్రజలకు దరిచేరేలే చేశామన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసి మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిళ్ల నాగరాణి, ఎలగందుల అనసూయ, నాయకులు నరసింహారెడ్డి, జగన్‌రెడ్డి, పద్మారెడ్డి, దేవారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ గద్దెకు కేసీఆర్ ముసుగు తొలగింపు



బీజేపీ జెండా గద్దెకు తెల్లరంగు వేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

చందుర్తి(వేములవాడ): ఎన్నికల నియమావళికి విరుద్ధంగా చందుర్తిలోని బీజేపీ గద్దెకు ఉన్న కేసీఆర్ ముసుగును తొలగించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెల్లరంగును శుక్రవారం వేయించారు. 'బీజేపీ గద్దెకు కేసీఆర్ ముసుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బీజేపీ గద్దెను కేసీఆర్ చిత్రాలు ఉన్న పత్రిక ప్రతులతో కప్పి వేయగా.. వాటిని శుక్రవారం తొలగించి తెల్లరంగు వేయించారు.

అధినేతల జోరు



ఉమ్మడి జిల్లాలో ప్రచారం ప్రారంభించనున్న నేతలు

- 15న హుస్నాబాద్, 17న సిరిసిల్లకు సీఎం కేసీఆర్
- హుస్నాబాద్ సభలోనే పార్టీ మేనిఫెస్టో వివరాల వెల్లడి
- 16న హుజూరాబాద్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- 18న జగిత్యాలకు రాహుల్, ప్రియాంక, కరీంనగర్‌కు కేటీఆర్
- కాంగ్రెస్ బస్సు యాత్ర అదేరోజు ప్రారంభం
- అర్వింద్ పర్యటనతో జగిత్యాల బీజేపీలో కొత్త ఊపు



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో ఎన్నికలవేడి రాజుకుంటోంది. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతల పర్యటనల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 15న పార్టీ ముఖ్య నేతలందరూ ఎన్నికల సమరశంఖం పూరించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్, బీఎస్పీ తెలంగాణ చీఫ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పర్యటించనున్నారు.

సీఎం సభతో మొదలు..

అభ్యర్థుల ప్రకటన మొదలు ప్రచారంలో ముందున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 15న ఉదయం ప్రగతిభవన్‌లో ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ–ఫారాలను అందజేస్తారు. ఆతర్వాత పార్టీకి ఎంతో కీలకమైన మేనిఫెస్టోను అక్కడే రిలీజ్ చేస్తారు. అనంతరం హుస్నాబాద్ బయల్దేరుతారు. పార్టీకి సెంటిమెంట్‌గా వస్తున్న హుస్నాబాద్ సభలోనే మేనిఫెస్టోలోని హామీలు రాష్ట్ర ప్రజలకు వివరిస్తారు. హుస్నాబాద్ జనసమీకరణ బాధ్యతలు కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్న అనిల్‌గౌడ్‌కు అధిష్టానం అప్పగించింది. 17న సిరిసిల్ల, వచ్చేనెల 3న కోరుట్ల, 7న పెద్దపల్లి, మంథనిలో జరిగే సభల్లో సీఎం మాట్లాడుతారు.

18న గంగుల ప్రచారంలో కేటీఆర్

ఈనెల 18న మంత్రి గంగుల కమలాకర్ ప్రచారం ప్రారంభించ నున్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సిరిసిల్ల నుంచి రానున్న కేటీఆర్‌కు మంత్రి గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులు స్వాగతం పలుకుతారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించి, భారీ ఊరేగింపుతో సభా ప్రాంగణానికి వెళ్తారు. అక్కడ కేటీఆర్ ప్రసంగిస్తారు. క్రమంగా మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ కేటీఆర్ పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర..

జగిత్యాల జిల్లా కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రారంభించనుంది. ఇందుకోసం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ రానున్నారు. కాంగ్రెస్ జిల్లాల పర్యటనకు ఉద్దేశించిన బస్సు పర్యటనలు విజయవంతం కావాలని కోరుతూ కొండగట్టు అంజన్న ఆశీర్వాదాలు తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే 18న రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ జగిత్యాలకు రానున్నారు. పార్టీ అగ్రనేతలతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీడర్లు ప్రచారం ముమ్మరం చేయనున్నారు.

రాజ్‌నాథ్, బండి, అర్వింద్..

బీజేపీలో జోష్ నింపేందుకు బీజేపీ అగ్రనాయకత్వం కేంద్ర నాయకులు, కేంద్రమంత్రులు ఉమ్మడి జిల్లాకు రానున్నారు. ఈనెల 16న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హుజూరాబాద్‌లో ప్రచారం ప్రారంభించనున్నారు. కరీంనగర్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా రాజ్‌నాథ్ పర్యటన అనంతరం కరీంనగర్‌లో ప్రచారం స్టార్ట్ చేస్తారని సమాచారం. ఇక కోరుట్ల అసెంబ్లీ స్థానంపై కన్నేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం పర్యటన పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. వీరితోపాటు బీఎస్పీ అభ్యర్థులకు మద్దతుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు.

ఎక్కడికక్కడే కట్టడి

- జిల్లాలో ఐదు చెక్‌పోస్టులు
- సరిహద్దుల్లో అనుక్షణం నిఘా
- క్షుణ్ణంగా వాహనాల తనిఖీ
- కోడ్ ఉల్లంఘనలపై ఆరా
- జిల్లా వ్యాప్తంగా సోదాలు



సిరిసిల్లటౌన్: జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే తనిఖీలు.. సోదాలతో పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇతర జిల్లాల నుంచి డబ్బు, మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ జిల్లాకు వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖి ల్ మహాజన్ నిరంతరం ఎన్నికల నిర్వహణపై ఉద్యోగులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలు

జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగకుండా పోలీస్, రెవెన్యూశాఖల అధికారులతో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. ఎలక్షన్ నిర్వహణ పకడ్బందీగా సాగడానికి ఎన్నికల నియమావళి అమలుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌తోపాటు టోల్‌ఫ్రీ నంబర్ 1950 ఏర్పాటు చేశారు. ఎన్‌జీఆర్‌ఎస్, సీవిజిల్ యాప్‌కు వచ్చే ఫిర్యాదులపై స్పందించేలా ఆదేశాలిచ్చారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిస్టిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్ మూడు చొప్పున పద్దెనిమిది బృందాలు పని చేస్తున్నాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనురాగ్ జయంతి హెచ్చరించారు.

ఆన్‌లైన్..ఆఫ్‌లైన్ నిఘా..

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియాతోపాటు ప్రత్యక్షంగా నిఘా పటిష్టం చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పరిశీలిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, గంభీరావుపేట మండలం పెద్దమ్మ, ముస్తాబాద్ మండలం బదనకల్, వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, బోయినపల్లి మండలం నర్సింగాపూర్ చెక్‌పోస్టుల్లో 30 మంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. వాట్సాప్‌తోపాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో మెస్సేజ్‌లపై నిరంతర నిఘా పెట్టారు. గ్రూప్ అడ్మిన్స్ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు.

సోదాలు..దాడులు

- జిల్లాలోని అన్ని బెల్టు షాపుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు పోలీసులుసోదాలు చేస్తూ మద్యం సీజ్ చేస్తున్నారు.
- ఐదు చెక్‌పోస్టుల్లో రెండు షిఫ్టుల్లో సిబ్బంది జిల్లాకు వచ్చిపోయే వాహనాలు అన్నింటిని చెక్ చేస్తున్నారు.
- రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లడానికి ఆస్కారం లేదు కాబట్టి నగదు రవా ణాపై ప్రత్యేక దృష్టి సారించారు.
- ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లో పొలిటికల్ లీడర్స్ ఫొటోలు, ప్రకటలు లేకుండా చూస్తున్నారు.
- జిల్లా నలుమూలల్లో ప్రత్యేక బలగాలు, అధికారులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

కోనరావుపేటను కోనసీమ చేస్తా

- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: తనను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేస్తే కోనరావుపేటను కోనసీమగా మారుస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. పట్టణంలోని చల్మెడ నివాసంలో శుక్రవారం కోనరావుపేట మండల ముఖ్యనాయకులు, కార్యకర్తలు, వివిధ కులసంఘాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు మల్కపేట రిజర్వాయర్‌తో మూడు టీఎంసీల నీళ్లు తీసుకొచ్చి కోనరావుపేట మండలాన్ని సస్యశ్యామలం చేయబోతున్నారన్నారు. గ్యారంటీ, వారంటీ లేని పథకాలు అని ఎద్దేవా చేశారు. రానున్న అసెంబ్లీలో ఎన్నికల నేపథ్యంలో మల్కపేట బిడ్డగా, సేవ చేయాలనే లక్ష్యంతో మీ ముందుకొస్తున్నానని, ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో మూడేళ్లలోపు కోనరావుపేట మండలంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, వైస్‌ఎంపీపీ సుమలత, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గోపు పర్శరాములు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల రుణం తీర్చుకుంటా

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మహిళా సంఘాల ప్రతినిధులతో ఆది శ్రీనివాస్

వేములవాడ: ఎవరికి ఆపదొచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది సేట్లేనని, భక్తి, వ్యాపారం, ఆలయాల పునరుద్ధరణలో ఆర్యవైశ్యులు ముందుంటారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణ ఆర్యవైశ్య అభ్యుదయ, అనుబంధ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని, నాలుగుసార్లు ఓడినా ప్రజల మధ్యలోనే ఉంటూ సేవ చేసుకుంటానన్నారు. తనకు అండగా ఉండేందుకు ఆర్యవైశ్యులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినందుకు రుణం తీర్చుకుంటానన్నారు. కాంగ్రెస్ మాజీ పట్టణాధ్యక్షుడు బాసెట్టి రవీందర్, సంఘం నాయకులు చీకోటి నాగరాజు, దైత కుమార్, నగుపోతు రవీందర్, ఎర్ర శ్రీనివాస్, కట్కం కిషన్, కటకం జనార్దన్, సిద్ధంశెట్టి వేణు, కొత్త అనిల్, నరాల శ్రీనివాస్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలు

- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి



రగుడులో ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్, తుర్కాశీనగర్, రగుడు గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, అన్ని వర్గాల ప్రజల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. తుర్కాశీనగర్‌లో పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, డీసీసీ ఉపాధ్యక్షులు వంగ మల్లేశం, బాల కిష్టయ్య, మాజీ కౌన్సిలర్ యెల్ల లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, గంభీరావుపేట ప్రశాంత్, బూర నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ నాయకులు సంగీతం శ్రీనాథ్, రెడ్డిమల్ల భాను, అక్కన సతీశ్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం





మీడియా సెంటర్ ప్రారంభిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, శిక్షణకు హాజరైన అధికారులు

- ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: ఎన్నికల నిర్వహణలో ఈవీఎం, వీవీప్యాట్‌ల నిర్వహణపై అధికారులకు అవగాహన అవసరమని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, మాస్టర్‌ట్రైనర్స్, తహసీల్దార్లు, మండల పంచాయతీ అధికారులకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. ఈవీఎం నిర్వహణపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ ప్రారంభమయ్యే ముందు, తర్వాత చేయాల్సిన విధుల గురించి వివరించారు. బ్యాలట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్స్ మిషన్‌ల అనుసంధానం, కమిషనింగ్, పోలింగ్ తర్వాత సీల్ వేసే విధానం వివరించారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఫిర్యాదులపై స్పందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో మీడియాసెంటర్, 24 గంటలు పనిచేసే ఫిర్యాదుల కేంద్రాన్ని ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరగడంలో ఫిర్యాదుల కేంద్రం, మీడియాసెంటర్ కీలకమన్నారు. ఎన్నికల ప్రకటనలు, ప్రచారాలపై నిఘా పెట్టాలని, మీడియాలో వచ్చే చెల్లింపు వార్తలు, రాజకీయ ప్రకటలను తనిఖీ చేయడంపై నివేదికలు రూపొందించి ఎన్నికల అధికారులకు పంపించాలని ఆదేశించారు. ప్రకటనల ఖర్చులను ఆయా పార్టీలు, అభ్యర్థుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, లేబర్ ఆఫీసర్ రఫీ, మాస్టర్ ట్రైనర్లు మహేందర్‌రెడ్డి, దేవేందర్ ఉన్నారు.

నోడల్ ఆఫీసర్స్ వీరే..

సిరిసిల్లఎడ్యుకేషన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు నోడల్ ఆఫీసర్స్‌ను కేటాయిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో రమేశ్‌కుమార్‌ను మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్‌గా, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పీబీ శ్రీనివాసాచారిని ట్రెనింగ్ మేనేజ్‌మెంట్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్‌ను మెటీరియల్ మేనేజ్‌మెంట్, డీటీవో కొండల్‌రావును ట్రాన్స్‌పోర్టు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎండీ రఫీని ఐటీ, అడిషనల్ డీఆర్డీవో రవికుమార్‌ను ఎస్వీఈఈపీ, ఎస్పీ అఖిల్ మహాజన్‌ను లా అండ్ ఆర్డర్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను ఈవీఎం మేనేజ్‌మెంట్, డీటీవో నీరజను ఖర్చులు పరిశీలన, డీడబ్ల్యూవో లక్ష్మీరాజంను బ్యాలట్ పేపర్స్, డీపీఆర్వో ఎం.దశరథంను మీడియా, సీపీవో శ్రీనివాసాచారిని కమ్యూనికేషన్ ప్లాన్, డిప్యూటీ సీఈవో గీత ఎలక్ట్రోరల్ రోల్స్, అసిస్టెంట్ డైరెక్టర్ హ్యాండ్‌లూమ్స్ సాగర్‌ను ఓటర్ హెల్ప్‌లైన్, ఆర్‌ఐ ఏడీ మైనింగ్ సైదులును పర్యవేక్షణ నోడల్ ఆఫీసర్స్‌గా విధులు కేటాయించారు. వీరితోపాటు మరికొంత మందికి వివిధ స్థాయిలో విధులు కేటాయింపులు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు వెల్లడించారు.

కేటీఆర్‌కే మా మద్దతు

- వస్త్రవ్యాపారుల నిర్ణయం



సమావేశమైన సిరిసిల్ల వస్త్ర వ్యాపారులు

సిరిసిల్లటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కేటీఆర్‌కు మద్దతు తెలుపుతున్నట్లు వస్త్ర వ్యాపారులు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం సిరిసిల్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శి వెల్దండి దేవదాసు, ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్‌కుమార్, కార్యదర్శి పోరండ్ల మల్లేశం, కోశాధికారి శ్రీరాం సత్యం, దూడం శంకర్, గోవిందు రవి, దూస భూమయ్య, గాజుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలపై ఆసక్తి చూపాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- నర్మాల గురుకులంలో జోనల్ మీట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని, క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 9వ జోనల్‌స్థాయి మీట్‌ను శుక్రవారం ప్రారంభించారు. జోనల్ పరిధిలోని 13 పాఠశాలలు, వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. నాలుగు రోజులపాటు వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, క్యారం, చెస్, లాంగ్‌జంప్, హైజంప్ వంటి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. అండర్–14, 17, 19 విభాగాలుగా పోటీలు నిర్వహిస్తున్నారు. గురుకులాల సొసైటీ ఉపకార్యదర్శి శ్రీనివాస్, ఆర్‌సీవో మేరీ యేసుపాదం, డీసీవో జాక్విలిన్, ప్రిన్సిపాల్ నిర్మల, పీడీ సుష్మ, పీఈటీలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికులకు ఉపాధి కల్పించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం లేబర్ అడ్డా వద్ద మీడియాతో మాట్లాడారు. స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో పనిదొరకడం లేదన్నారు. ఈవిషయమై జిల్లా అధికారులకు ఎన్నో రోజులుగా విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో ప్రభుత్వ ప్రాజెక్టులు, పథకాలు నడుస్తున్నాయని వాటిలో స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్మిక నాయకులు ఎల్లా దేవరాజు, ప్రవీణ్, రాజశేఖర్, మల్లేశ్, భగవత్ తదితరులు పాల్గొన్నారు.

14న ఫీడింగ్ డే

సిరిసిల్లటౌన్: జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14న ఫీడింగ్ డే నిర్వహిస్తున్నట్లు డీడబ్ల్యూవో లక్ష్మీరాజం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలతో ఆరోగ్యలక్ష్మి భోజన పదార్థాల మెనూ ప్రకటించారు. మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు స్పాట్ ఫీడింగ్ ఇచ్చేలా సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు సూచించారు.

చదును పనులు అడ్డుకున్న రైతులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం శుక్రవారం చదును చేస్తుండగా స్థానిక రైతులు అడ్డుకున్నట్లు సమాచారం. చిన్నబోనాల గ్రామంలో మెప్మా శ్రీసరస్వతీ మహిళా సమాఖ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏటా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంటారు. గతంలో సిరిసిల్ల రెండోబైపాస్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు. కానీ బైపాస్ రోడ్డు పూర్తవడంతో కొనుగోలు కేంద్రానికి గ్రామ శివారులో ఉన్న పదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వేడుకున్నారు. కాగా శుక్రవారం కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో భూమిని చదును చేస్తుండగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. చదును చేస్తున్న వారికి తెలియక ప్రభుత్వ భూమితోపాటు పక్కనే ఉన్న రైతుల భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్నారని కౌన్సిలర్ తెలిపారు.

పూల జాతరకు వేళాయే..





బతుకమ్మ సంబరాలు శనివారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లాలోని మానేరుతీరం పూలవనంలా మారనుంది. శుక్రవారం సాయంత్రం నుంచే బతుకమ్మ పేర్చేందుకు అవసరమైన గునుగు, తంగేడు పూలను పల్లెటూళ్ల నుంచి తీసుకొచ్చి సిరిసిల్ల మార్కెట్‌లో విక్రయించారు. నీళ్లు పుష్కలంగా ఉండడంతో ఖాళీ స్థలాలు లేక పూల కొరత ఏర్పడింది. మూడు కట్టల తంగేడుకు రూ.50, మూడు గునుగు పూల కట్టలకు రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

జ్ఞాపకాలు పదిలం..

- పితృ అమావాస్యనాడు పెద్దలకు బియ్యం
- చనిపోయిన వారి ఆత్మశాంతికి తర్పణాలు



జంగమయ్యకు బియ్యం సమర్పిస్తున్న జనం

సిరిసిల్లకల్చరల్: చనిపోయిన పెద్దల జ్ఞాపకార్థం పితృ అమావాస్య నాడు బియ్యం ఇవ్వడం సంప్రదాయం. ఏటా పితృ అమావాస్య రోజున సిరిసిల్ల ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో ఉదయమే జంగమయ్యకు బియ్యం, కూరగాయలు ఇస్తుండడం కనిపిస్తుంటుంది. చనిపోయిన వారిని జ్ఞప్తికి తెచ్చుకోవడం.. వారి పేరిట దాన ధర్మాలు చేయడం దీని ఉద్దేశం.

పితృ పక్షంలోనే..

మహాలయ పక్షంలోని పదిహేను రోజులు చనిపోయిన తమ కుటుంబాల్లోని పెద్దలకు బియ్యం ఇస్తుంటారు. శుక్రవారం నాటి అమావాస్యతో ఈ పక్షం ముగుస్తోంది. ఈ సమయంలో చాలా మంది ఈ ఆచారాన్ని అనుసరించి జంగమయ్యల ఇళ్లకెళ్లి బియ్యం ఇస్తుంటారు. పెద్దలు చనిపోయిన తిథులు గుర్తుండని వారు పితృఅమావాస్య రోజున బియ్యం ఇస్తుంటారు. ఉప్పు, పప్పు, నెయ్యి, కాశీలోని గయ లాంటి పుణ్య క్షేత్రాల్లోని వృక్షం కింద బ్రాహ్మణుల భోజనం నిమిత్తం తృప్తిగా ఇస్తినయ్యా అంటూ జంగమయ్యల ముందు ప్రణమిల్లుతారు. ఇలా సమర్పించిన బియ్యంలోంచి పిడికెడు బియ్యాన్ని తిరిగి తీసుకుని వంట చేసుకునే బియ్యంలో కలిపి ఆ రోజున శ్రాద్ధకర్మలకు అవసరమైన ఆహార పదార్థాలు తయారు చేస్తారు. బంధు మిత్రులతో కలిసి పూర్వీకులను స్మరిస్తూ తర్పణాలు వదిలి భుజిస్తారు.

ఎందుకీ తర్పణాలు

మనిషి ప్రయాణానికి నిజమైన గమ్యం మోక్షమే అని అందరి విశ్వాసం. గతించిన వాళ్లకు మోక్షం లభించాలంటే సశరీరంగా ఈ లోకానికి రావాలంటే వారికి ఆహారం అందిస్తేనే రుణం తీరి మోక్షం లభిస్తుందని ప్రజల నమ్మకం. ఇందులో భాగంగానే పితృ అమావాస్య రోజున తమ కుటుంబంలో మరణించిన పెద్దల పేరిట ఇలా చేస్తుంటారు.

‘డబుల్’ ఇళ్ల అవకతవకలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు

గంభీరావుపేట (సిరిసిల్ల): మండలకేంద్రంలో అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేశారని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ చేపట్టాలని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దృష్టికొచ్చిన అనర్హులను పేర్లను తొలగించడం జరిగిందని, ఇంకా అనర్హులు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎవరైన ప్రత్యక్షంగా, పరోక్షంగా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విన్నవించారు. పూర్తిస్థాయిలో రీసర్వే చేసి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందేలా కృషిచేయాలని కోరారు.

ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం



వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలో ఎన్నికల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ రంగంలోకి దిగాయి. శుక్రవారం ఉదయం మండల పరిషత్ ఆవరణ నుంచి ఆ బృందం బయలుదేరి వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది.

ఎమ్మెల్సీని కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు



ట్రాక్‌సూట్స్ అందజేస్తున్న ఎమ్మెల్సీ

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డిని తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం(టీజీపీఈటీఏ) జిల్లా బాధ్యులు కలిశారు. అర్హులైన వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టీజీ పీఈటీ అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు దుప్పటి రవికుమార్ సొంత ఖర్చులతో వ్యాయామ ఉపాధ్యాయులకు ట్రాక్‌షూట్స్ అందించారు. నాంపెల్లి శ్రీనివాస్, తడుకల శ్యామ్‌సుందర్, రాజు, సంధ్యారాణి, కుంట శ్రీనివాస్, నరేశ్, రమేశ్, అజయ్, రజిత, భానురేఖ, సుజాత, దివ్య, సురేశ్ ఉన్నారు.

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

- ఎంపీపీ జనగామ శరత్‌రావు



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. మండలంలోని ఆవునూర్, తుర్కపల్లి, రామలక్ష్మణపల్లెల్లో శుక్రవారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచులు రవీందర్‌రెడ్డి, కాశోల్ల పద్మ, సతీశ్, దుర్గాప్రసాద్, బాలకృష్ణ, రంజిత్, భాను తదితరులు పాల్గొన్నారు.

కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



సిరిసిల్లటౌన్: మల్కపేట రిజర్వాయర్‌కు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఈ విషయమై తెలంగాణ సర్కారు పునరాలోచన చేయాలని కోరారు. ఈనెల 17న సిరిసిల్లకు వస్తున్న సీఎం కేసీఆర్ ఈమేరకు ప్రకటన చేయకుంటే దళిత సామాజికవర్గంతో సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. పంతం రవి, మంచికట్ల రమేశ్, కడారి రాములు, సోమ నాగరాజు, వెంకన్న, రాజేశం పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు సిద్ధం



బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రిక



శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం

- భక్తులకు సకల సౌకర్యాలు
- ప్రణాళికతో ఉత్సవాలు నిర్వహించాలి
- సిరిసిల్ల ఆర్డీవో ఆనందకుమార్
- ఉత్సవాల నిర్వహణపై కోఆర్డినేషన్ మీటింగ్

సిరిసిల్లటౌన్: శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తయినట్లు సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆలయ సిబ్బందితో శుక్రవారం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్రహ్మోత్సవ, రథోత్సవాలకు వచ్చే భక్తులకు వసతులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటు ఉంటుందన్నారు. ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్ ఉన్నారు.

ఉత్సవాల షెడ్యూల్ ఇదీ..

బ్రహ్మోత్సవాలను శ్రీవైష్ణవ పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆశ్వయుజ బహుళ సప్తమి(అక్టోబర్ 21) నుంచి అశ్వయుజ బహుళ విదియ(అక్టోబర్ 30) వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీరావు తెలిపారు. ఈనెల 23న కల్యాణోత్సవం, 24న దసరా శమీపూజ, 28న రథోత్సవం జరుగుతాయన్నారు. చంద్రగ్రహణం నేపథ్యంలో రథోత్సవం మధ్యాహ్నం 2 గంటల వరకే ఉంటుందని అనంతరం పురవీధుల్లో రథోత్సవం నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఆలయం మూసి వేయనున్నట్లు తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు

- రూ.500 జరిమానా

వేములవాడరూరల్/బోయినపల్లి: మద్యం సేవించి వాహనాలు నడిపిన పదకొండు మందికి వేములవాడ కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ ఒక్క రోజు జైలుతోపాటు రూ.500 జరిమానా విధించినట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి శుక్రవారం తెలిపారు. మాన్వాడకు చెందిన వెంకటి, ఒగులాపూర్‌కు చెందిన ముత్తయ్య, లక్ష్మీపూర్‌కు చెందిన పెద్దరాజయ్య, బోనాలకు చెందిన రామస్వామి, గంగాధరకు చెందిన గోపాలస్వామి, బావుపేటకు చెందిన సంపత్‌లకు డ్రంకెన్‌డ్రైవ్ కేసులో శిక్ష పడిందని బోయినపల్లి ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సైలు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోటాపోటీ ప్రచారం



సీఎం సభకు రావాలని చైర్‌పర్సన్ ప్రచారం



విలీన గ్రామాల్లో కేకే మహేందర్‌రెడ్డి ప్రచారం

- సిరిసిల్లలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విస్తృత ప్రచారం

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్లలో ఎన్నికల ప్రచార సందడి నెలకొంది. అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారం జరిగింది. ఈనెల 17న సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం కేసీఆర్ రానుండడంతో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు బొట్టు పెడుతూ ఆహ్వానం పలికారు. ఇక బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో అన్నివార్డుల ప్రతినిధులతో కలిసి సమావేశాలు ఏర్పాటుచేసి సీఎం సభ విజయవంతం చేయడానికి పెద్దసంఖ్యలో తరలివచ్చేలా ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ నియోజనకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు విలీన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. సోనియా గాంధీ ఇచ్చిన ఆరు హామీలను అమలవడం ఖచ్చితమని కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, గోనె ఎల్లప్ప తదితరులు ప్రచారాన్ని హోరెత్తించారు.

గెలుపు బీజేపీదే

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్



చందుర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేశ్ పేర్కొన్నారు. చందుర్తి మండలం మల్యాల, చందుర్తిలో నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తులు చేయించి, వారికి ఆ పథకంపై రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్ శుక్రవారం అవగాహన కల్పించారు. తమ పార్టీకి అన్నివర్గాల ప్రజల మద్దతు ఉందన్నారు. ప్రపంచ దేశాలు మోదీ పాలనను కొనియాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు పొంచెట్టి రాకేశ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెరుక గంగరాజు, లోకోజు సతీశ్, పొంచెట్టి అంజయ్య పాల్గొన్నారు.

‘బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం’



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోపి

గంభీరావుపేట(సిరిసిల్ల): గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, అందుకే ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. మండలంలోని దేశాయిపేటలో పలువురు యువకులు, మహిళలు శుక్రవారం బీజేపీలో చేరారు. గోపి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ తన దత్తత గ్రామంగా చెప్పుకునే దేశాయిపేటలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. గ్రామాల్లోని సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గంట అశోక్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పర్శరాంగౌడ్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు పత్తి స్వామిరాజ్, మహేశ్‌యాదవ్, అరవింద్‌గౌడ్, తోక స్వామి, రమేశ్, విగ్నేశ్, రాజు, బాలరాజు, రాజనర్సు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమ అభివృద్ధికి కట్టుబడాలి

- మేనిఫెస్టోలో సమగ్ర ప్రణాళిక పొందుపర్చాలి
- పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్
- సీపీఎం ఆఫీసులో రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: సంక్షోభం కారణంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సిరిసిల్ల వస్త్రర పరిశ్రమను అభివృద్ధి చేసేలా అన్ని పార్టీలు సమగ్ర ప్రణాళికను ప్రకటించాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల కార్మికులు, ఆసాములతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల క్రితం సిరిసిల్లలో 36 వేల సాంచాలుండగా.. ఇప్పుడు 20 వేలకు తగ్గాయన్నారు. టెక్స్‌టైల్ పార్కులో 230 పరిశ్రమలు ఉండగా.. నేడు 30 మాత్రమే నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మచీరల ఆర్డర్లతో నాలుగు నెలలు మాత్రమే ఉపాధి అందుతుందని పేర్కొన్నారు. మిగతా రోజుల్లో పని దొరక్క కార్మిక కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఏడాది పొడవునా పనిదొరికేలా, కనీస వేతనం రూ.26వేలు వచ్చేలా, వర్కర్ టు ఓనర్ పథకం అమలయ్యేలా చూడాలని కోరారు. ఈమేరకు అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీలు నూలు డిపో ఏర్పాటు, ఉచిత కరెంట్, యారన్ సబ్సిడీ పెంపు, నేతన్నబంధు రూ.10లక్షలతో అమలు చేయాలని కోరారు. కోడం రమణ, మండల రాజు, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, కిషన్, గణేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

కేటీఆర్ సారూ.. న్యాయం చేయండి



మున్సిపల్ ముందు బైఠాయించిన జ్యోతి

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ సారూ.. నాకు న్యాయం చేయండి అంటూ.. ఓ మహిళా సంఘం సభ్యురాలు తన ఇద్దరు ఆడపిల్లలతో కలిసి సిరిసిల్ల మున్సిపల్ ముందు శుక్రవారం బైఠాయించింది. బాధితురాలు జక్కుల జ్యోతి మీడియాతో మాట్లాడుతూ.. సంజీవయ్యనగర్‌కు చెందిన తాను స్లమ్ సమాఖ్య సభ్యురాలినని, కొత్తబస్టాండు వద్ద బాత్‌రూమ్‌ల నిర్వహణ లెక్కలు అడిగినట్లు తెలిపింది. దీనికిగాను తమ ఆర్పీ కక్ష గట్టి గ్రూప్ ద్వారా వచ్చిన లోన్ ఇవ్వకుండా వేధిస్తుందని తెలిపింది. ఈవిషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. తనకు న్యాయం జరుగలేదని మంత్రి కేటీఆర్ స్పందించాలని కోరింది. ఈమేరకు మున్సిపల్‌లో వినతిపత్రం అందిస్తున్నట్లు పేర్కొంది.

హత్యకేసులో జీవితఖైదు

- మరొకరికి మూడేళ్లు



లింగంపల్లి కిట్టు



లింగంపల్లి రాజయ్య

సిరిసిల్లక్రైం/చందుర్తి(వేములవాడ): హత్య కేసులో ఒకరికి జీవితఖైదు, మరొకరికి మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జడ్జి ప్రేమలత శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. 2018 ఫిబ్రవరిలో చందుర్తి మండలం రామారావుపల్లికి చెందిన లింగంపల్లి కిట్టు అలియాస్ వెంకటేశ్ చెల్లెలు ప్రియాంకను లింగంపల్లి లింగయ్య కొడుకు అనిల్ ప్రేమవివాహం చేసుకున్నాడు. కుటుంబం పరువు తీశారన్న కోపంతో లింగంపల్లి లింగయ్యపై వెంకటేశ్, అతని తండ్రి లింగంపల్లి రాజయ్య గొడ్డలితో దాడిచేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లింగంపల్లి రాజవ్వ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై మల్లేశ్‌గౌడ్ కేసు నమోదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రేమలత కిట్టు అలియాస్ వెంకటేశ్‌కు యావజ్జీవ శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా, లింగంపల్లి రాజయ్యకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. మిగతా వారిపై కేసు కొట్టేశారు. కేసు నిరూపణలో కృషిచేసిన పోలీస్ అధికారులను, ప్రాసిక్యూషన్ సమయంలో సహకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు తిరుపతి, లతీఫ్, కానిస్టేబుల్ నరేందర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

"సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే." – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

● బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన 'ఊపిరి' నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన అస్త్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు 'సుద్దాల' పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజాగాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు- జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, 'మోదుగుపూలు' ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

'బీ థర్మల్' మనుగడ ప్రశ్నార్థకం

- జీవితకాలం ముగిసి 25ఏళ్లు
- ఆధునికీకరణకు నోచాన్స్
- కొత్త ప్రాజెక్టు ఏర్పాటే ప్రత్యామ్నాయం

రామగుండం: 62.5 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్ కేంద్రాల జీవితకాలం పాతికేళ్లే అని జెన్‌కో డైరెక్టర్లు ఇటీవల స్పష్టం చేయడంతో అది కాలంచెల్లిన జాబితాలో చేరినట్లయ్యింది.

1965లో శంకుస్థాపన..

- రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)కి అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న శంకుస్థాపన చేశారు.
- రూ.రూ.14.8 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు జవహర్‌లాల్ నెహ్రూ థర్మల్ విద్యుత్ కేంద్రంగా నామకరణం చేశారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది తొలి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం.
- అయితే, స్థానికంగా వనరుల లభ్యత సమృద్ధిగా ఉండడంతో కొత్తగా 800 మెగావాట్ల సామర్థ్యం మరో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది.
- దీనిద్వారా నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కాలంచెల్లిన జాబితాలో..

- పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా 200 మెగావాట్లలోపు 25 ఏళ్లపైబడి జీవితకాలం ఉన్న విద్యుత్ కేంద్రాలను కూల్చి, వాటిస్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అధికారాన్ని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి అప్పగించింది. దీంతో కొత్తగూడెంలో ఐదు యూనిట్లను ఇటీవల కూల్చివేసి కొత్తవి స్థాపించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఢిల్లీలోని సీఈఏ చైర్మన్‌ను ఇటీవల కలిశారు. బీ-థర్మల్‌ను సీఈఏ నామ్స్‌కు లోబడి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, పారామీటర్స్ అంశాలు వివరించారు. దీంతో సీఈఏ గడువు పొడిగించింది.



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

తరచూ సాంకేతిక సమస్యలు..

- కాలంచెల్లిన ప్రాజెక్టు కావడంతో బాయిలర్ ట్యూబ్స్, మిల్స్, టర్బయిన్ విభాగాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- ప్రతీసారి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది.
- పునరుద్ధరణకు విడిభాగాలు లభ్యం కావడం లేదు.
- స్థానిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరిస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ సమస్యలు తలెత్తుతున్నాయి.
- విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ తర్వాత మళ్లీ ఆయిల్ మండించి బాయిలర్ స్టార్టప్ చేసేందుకు సుమారు రూ.20లక్షల వ్యయం అవుతోంది.
- ఇలా ఏటా సుమారు 30సార్లు షట్‌డౌన్ కావడంతో పునరుద్ధరణకే రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తోంది.

కొత్త విద్యుత్ కేంద్రం స్థాపనకు అనుకూలతలు..

- బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం తొలగించి, అదేస్థలంలో 500 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త పరిశ్రమ ఏర్పాటు చేసే వీలుంది. ఇందుకు అవసరమైన స్థలం, ఇతర వనరుల లభ్యతపై నాలుగేళ్ల క్రితమే జెన్‌కో సర్వే చేసింది. మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 0.7 ఎకరాలు అవసరమూతే.. 500 మెగావాట్ల ప్రాజెక్టుకు 350 ఎకరాలు(ఉద్యోగుల వసతి గృహాలతో కలుపుకొని)అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఏ- కాలనీ నుంచి సీ- కాలనీ అతిథి గృహం వరకు 44.5 ఎకరాలు, ఏ, బీ, సీ కాలనీలతోపాటు పెద్దచెరువు, విద్యుత్ కేంద్రం స్థలంతో కలుపుకొని 390 ఎకరాలు ఉన్నట్లు గుర్తించింది. వీటితో పాటు బూడిద చెరువు 127 ఎకరాలు, వాటర్ రిజర్వాయర్లు ప్లాంట్‌లోని ఖాళీ ప్రదేశాన్ని కలుపుకొని మరో 400 ఎకరాలు ఉన్నట్లు తేల్చారు. ఐదు వందల ఎకరాల విద్యుత్ కేంద్రానికి 100 ఎకరాల బూడిద చెరువు సరిపోతుందని, ప్రస్తుతం బూడిద చెరువు 125 ఎకరాల విస్తీర్ణంలో ఉందని నివేదిక రూపొందించింది.

తక్కువ ధరకే అందుబాటులోకి..

స్థానికంగా నీరు, బొగ్గు అందుబాటులో ఉంది. దీంతో రవాణా ఖర్చు తగ్గుతుంది. తద్వారా విద్యుత్ తక్కువ ధరకే లభ్యమవుతుంది. దీనిమీపంలోనే ఓపెన్‌కాస్టు బొగ్గు గనులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీరు, విద్యుత్ కేంద్రం లోపలి వరకు ఇప్పటికే రోడ్డు, రైలు మార్గం.. ఇలా అన్నీ అనుకూలంగా ఉన్నాయి. తద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమని ఇంజినీర్లు చెబుతున్నారు.

కొత్తది స్థాపించాలి



బీ థర్మల్ విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని, సాధ్యం కాకుంటే కొత్త పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే దీక్షలు చేశాం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
– కౌశిక హరి, కార్మిక సంఘం ప్రతినిధి

అందుబాటులో వనరులు



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి బీ-థర్మల్ స్థలంలో స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించాలి. తద్వారా రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగవించవచ్చు.
– కన్నూరి సతీశ్‌కుమార్, విద్యుత్ కేంద్రం సాధన సమితి చైర్మన్

చకచకా శరన్నవరాత్రి ఏర్పాట్లు

- ముస్తాబైన బాసర ఆలయం
- బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది
- ఆలయం ముందు మొరం పోయిస్తున్న అధికారులు
- కోనేరు శుద్ధి చేయాలంటున్న భక్తులు
- రేపటి నుంచే శరన్నవరాత్రి ఉత్సవాలు

భైంసా: బాసరలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. దసరా వరకు కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆహ్వానాలు పంపించారు. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ పెద్దలకు ఆలయ అర్చక బృందం ఆహ్వానాలు ఇచ్చి ఉత్సవాలకు రావాలని కోరారు. ఇక యేట బాసరలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది భక్తులు వస్తుంటారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసాల సంఖ్య అధికంగా ఉంటుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఈయేడు కూడా ఆలయ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా, భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

క్యూలైన్లు ఏర్పాట్లు...

బాసర ప్రధాన ద్వారం, ఆలయం, ఆలయ ప్రాంగణం, పరిసరాలు, వేదవ్యాస గుడి ఇలా అన్ని చోట్ల ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. టీటీడీ సత్రం నుంచే స్వాగతతోరణం ఏర్పాటుచేసి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్షరాభ్యాసాలు జరిపించి బయటకు వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

మొరం వేసి...

వసతిగృహాలు, ప్రసాద కౌంటర్‌కు మధ్య బండ రాళ్ల గుట్ట ఉండేది. కొన్ని రోజులుగా ఈ పనులను పూర్తిచేసి బండరాళ్లు తొలగించేశారు. వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ఇక్కడ టిప్పర్లతో మొరం వేయించి చదును చేయిస్తున్నారు.



బాసర ఆలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు



రాళ్లు తొలగించి మొరం పోస్తున్న దృశ్యం

రంగుమారిన కోనేరు నీరు...

బాసర ఆలయానికి ఆనుకుని కోనేరు ఉంది. వ్యాస మహర్షి ఆలయం బాసర సరస్వతీ ఆలయం మధ్య ఈ కోనేరు కనిపిస్తుంది. చుట్టూ గార్డెన్ ఉండడంతో కోనేరు ఉందన్న విషయం తెలియడంలేదు. 20 ఏళ్ల క్రితం బాసర వచ్చేవారంతా ఈ కోనేరులోనే స్నానాలు చేసేవారు. రానురాను కోనేరు మార్గం మూసి పచ్చని గడ్డి, చెట్లు పెంచారు. వచ్చిన భక్తులంతా నేరుగా ఆలయానికే వెళ్తున్నారు. గతంలో ఈ కోనేరులో దిగి ఇక్కడే నెత్తిపై నీళ్లు చల్లుకుని అమ్మవారి దర్శనానికివెళ్లేవారు. కోనేరు నిర్వాహణ లేక అందులో నీరంతా రంగుమారింది. దగ్గరికి వెళ్లితే పచ్చని రంగుతో కనిపించే నీటి నుంచి దుర్వాసన వస్తుంది. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కోనేటిని శుద్ధిచేయాలని భక్తులు కోరుతున్నారు.

గోదావరి వద్ద...

బాసర గోదావరి నది వద్ద ప్రధాన స్నానఘట్టాలు ఇప్పుడిప్పుడే శుభ్రంచేస్తున్నారు. ఈయేడు గోదావరి నదిలో వరదనీటిలో నల్లమట్టి బాగా చేరింది. బాసర వంతెన నుంచి సూర్యేశ్వర స్వామి ఆలయం వరకు విశాలంగా ఉన్న స్నానఘట్టాల్లో అంతా స్నానాలుచేస్తారు. నల్లమట్టిలో కాలుజారి నీటిలో పడిపోతున్నారు. అధికారులు ఈ విషయంపై స్పందించి పూర్తిగా నల్లమట్టి తొలగించిన ఘాట్‌ల వద్దే స్నానాలుచేసేలా భక్తులకు సూచనలు ఇవ్వాలి.

ఏర్పాట్లు చేస్తున్నాం

బాసర ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు అందించి బాసర రావాలని కోరాం. బాసర వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. బాసర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాం.
– విజయరామారావు, ఆలయ ఈవో

ముస్తాబైన రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం

- ఎన్నిక చెల్లదన్న 'పత్తిరెడ్డి' పిటిషన్‌పై హైకోర్టు విచారణ
- సంతకాల ఫోర్జరీపై ఫోరెన్సిక్ నివేదికకు ఆదేశం

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం కొనసాగుతోంది. ఈ ఎన్నిక చెల్లదని నిర్మల్ జిల్లాకు చెందిన పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. శుక్రవారం విచారణకు రాగా.. ఆ పత్రాలపై సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పోల్చి నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 24మంది నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా విఠల్ నిలువగా, బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పార్టీ ఆదేశాలను ధిక్కరించి నామినేషన్ వేశారు. ఉపసంహరణ రోజు 22 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తుడుందెబ్బకు చెందిన పెందూర్ పుష్పరాణి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. పోలింగ్ తర్వాత భారీ ఆధిక్యంతో విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికపై పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో విచారణ కొనసాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పత్రాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సంతకాలను పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. తాజా పరిణామాలు రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

'కడెం'ను సందర్శించిన జీఆర్ఎంబీ అధికారులు



కడెం ప్రాజెక్ట్ వద్ద అధికారులు

కడెం: కడెం ప్రాజెక్టును గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ) కార్యదర్శి ఆరిగేషణ్, ఈఈ బత్తుల వెంకటస్వామి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్ అండర్ గ్రౌండర్ గేట్‌లను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టును సందర్శించామని తెలిపారు. ప్రాజెక్ట్ నీటిమట్టం, ప్రధాన సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవికుమార్, సర్వార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారయణ తదితరులు ఉన్నారు.